

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శనివారం ఎర్రవెల్లిలోని నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సహధర్మచారిణిని కోల్పోయి బాధలో ఉన్న లక్ష్మారెడ్డికి కేసీఆర్ ధైర్యం చెప్పారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

రెండు నెలల్లో శ్రీశైలం ఖాళీ ?

మొదటిపేజీ తరువాయి...

తరలించుకుపోతున్నది. కొల్లాపూర్ మండలంలోని సోమశిల వద్ద ఉన్న కృష్ణా అవతలి వైపు పోతిరెడ్డిపాడు కాల్వలో రోజుకు 24 వేల క్యూసెక్కులు(2 టీఎంసీలు) తరలించాల్సి ఉండగా.. ప్రస్తుతం 36 వేల క్యూసెక్కులు(3 టీఎంసీలు) తరలించుకోపోతున్నది. దీనికి తోడు హంద్రీనివా, ముచ్చుమర్రి, మల్యాల ప్రాజెక్టుల నుంచి కూడా రోజుకు 12 వేల క్యూసెక్కుల (టీఎంసీ వరకు) నీటి తరలింపు కొనసాగుతున్నది. దిగువ ప్రాంతంలో రాయలసీమ ఉండడంతో నది నుంచి నీరంతా వేగంగా అక్కడి కాల్వల ద్వారా పారుతోంది. మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం(ఎంజీకేఎల్) ద్వారా రోజుకు 4 వేల క్యూసెక్కులు మాత్రమే మనం ఎత్తిపోసుకుంటున్నాం. పాలమూరు-రంగారెడ్డి (పీఆర్ఎల్ఐ) ద్వారా నీటి పంపింగ్ కొనసాగడం లేదు. దీంతో తెలంగాణ తీవ్రంగా నష్టోపోతున్నది. బ్యాక్ వాటర్‌ను ఇలాగే తోడిపోస్తే రెండు నెలల్లో శ్రీశైలం ఖాళీ కావడం ఖాయమని ఓ అధికారి తెలిపారు. శ్రీశైలం జలాశయంలో శుక్రవారం నాటికి 875.6 అడుగుల నీటిమట్టం నమోదైంది.

'పాలమూరు ప్రాజెక్టు'పై పక్షపాతం

ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లోని 10 లక్షల ఎకరాలకు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 2.30 లక్షల ఎకరాలకు సాగు, తాగు నీటికి, పరిశ్రమలకు నీటిని అందించేలా నిర్మించారు. లిఫ్ట్-1లోని నార్లాపూర్ రిజర్వాయర్ 6.40 టీఎంసీలు(9 టీఎంసీల పెంపునకు అవకాశం), వీరాంజనేయ రిజర్వాయర్ 6.55 టీఎంసీలు, వెంకటాద్రి రిజర్వాయర్ 16.74 టీఎంసీలు, కురుమూర్తిరాయ రిజర్వాయర్ 19 టీఎంసీలు, ఉద్దండాపూర్ రిజర్వాయర్ 16.03 టీఎంసీలు, కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ 2.80 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ లిఫ్ట్‌నకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నీటిని తీసుకోవాలంటే డ్యాం నీటిమట్టం 800 అడుగులు ఉండాలి. ఐదు

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల వద్ద కృష్ణానదిలో గణనీయంగా తగ్గిన నీటిమట్టం

రిజర్వాయర్ల పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 95 శాతం పనులు పూర్తవగా.. 70 టీఎంసీల సామర్థ్యంతో వీటిని నిర్మించారు. ప్రతి రిజర్వాయర్‌లో 9 మోటర్లు బిగించారు. అంతటి పెద్ద ప్రాజెక్టును ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రేవంత్ ప్రభుత్వం వచ్చి 11 నెలలైనా పనులపై దృష్టి సారించలేదు. గతేడాది సెప్టెంబర్ 16వ తేదీన కొల్లాపూర్ సమీపంలోని మొదటి లిఫ్ట్‌ను నాటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. తర్వాత నార్లాపూర్ రిజర్వాయర్‌ను నీటిని నింపారు. కానీ నేడు రిజర్వాయర్లలోకి చుక్క నీటిని కూడా తరలించలేదు.

నీటి తరలింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం

శ్రీశైలం నిల్వ నీటి తరలింపులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో కాల్వల ద్వారా ఏపీ ఎక్కువ మొత్తంలో జలాలను పారిస్తుండగా.. తెలంగాణ తక్కువ మొత్తంలో రెండు ఎత్తిపోతల ద్వారా తరలిస్తున్నది. నీటి తరలింపులో ముందస్తు ప్రణాళిక లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు వరప్రదాయిని ఎంజీకేఎల్ఐకి బ్యాక్ వాటర్ 824 అడుగుల వద్ద మాత్రమే నీటిని డ్రా చేసుకొనే అవకాశం ఉంటుందని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిసింది. ఎంజీకేఎల్ఐ నుంచే మిషన్ భగీరథ పథకానికి నీటిని వినియోగిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎల్లూరు రిజర్వాయర్‌లో ఉన్న 0.35 టీఎంసీలు కేవలం పది రోజులు తాగు నీటిని అందించేందుకే మాత్రమే సరిపోతాయని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తున్నదా?

450 టీఎంసీలకు తరలించుకుపోతున్న ఏపీ సర్కారు

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి ఫైర్

కొల్లాపూర్, నవంబర్ 16: ఏపీ ప్రభుత్వం 450 టీఎంసీలను తరలించుకుపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తున్నదని... ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐ) పెండింగ్ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణానది జలాలపై 69 శాతం తెలంగాణకు హక్కు ఉన్నా వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. పీఆర్ఎల్ఐ నిలిచిపోయిన పనులను చూస్తుంటే చాలా బాధగా ఉందని చెప్పారు. కుడికిళ్ల నుంచి తీర్నాంపల్లి వరకు 3.5 కిలోమీటర్ల మేర పెండింగ్ ఉన్న కాల్వ పనులు పూర్తి చేస్తే ఉద్దండాపూర్ రిజర్వాయర్ వరకు నీళ్లను తీసుకెళ్లే వీలుంటుందని చెప్పారు. 50 టీఎంసీలను నిల్వ చేసుకునే అవకాశం ఉన్నా.. ప్రభుత్వ వైఫల్యంతో యాసంగిలో సాగునీటి ఇబ్బందులు తలెత్తనున్నాయని చెప్పారు.



పీఆర్ఎల్ఐ పెండింగ్ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి నాగం

పాలమూరు జిల్లావాసి అయిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి జన్మధన్యం చేసుకోవాలని కోరారు. ప్రాజెక్టు పెండింగ్ పనులపై చర్చించేందుకు ఎక్కడికైనా వచ్చేందుకు సిద్ధమని చెప్పారు.

ట్రిపుల్ ఐటీకి వెళ్లని 'పొంగులేటి'

- విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నా సందర్శించని మంత్రి
- కాంగ్రెస్ హయాంలో ఒక్కసారి కూడా రాని మంత్రులు సీతక్క, శ్రీనివాస్‌రెడ్డి

బాసర, నవంబర్ 16 : బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నా మంత్రులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెండు రోజులుగా నిర్మల్ జిల్లా ముథోల్ నియోజక వర్గంలోనే ఉంటున్నారు. శనివారం ఉదయం నిర్మల్ జిల్లా భైంసా నుంచి ట్రిపుల్ ఐటీ మీదుగా బాసర అమ్మవారి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో ట్రిపుల్ ఐటీ మీదుగానే భైంసాకు వెళ్లారు. గత సోమవారం పీయూసీ- రెండో సంవత్సరం విద్యార్థిని స్వాతిప్రియ హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల సమస్యలు తెలిసి కూడా మంత్రి కనీసం లోపలికి వెళ్లి విద్యార్థులతో కలవలేకపోయారు. నూతనంగా ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన వీసీ గోవర్ధన్ భైంసాలోని ఓ ప్రైవేటు అతిథి గృహం వద్దకు వెళ్లి మంత్రిని కలిసి ట్రిపుల్ ఐటీ సమస్యలను వివరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న సీతక్క గతంలో బాసరకు వచ్చినా ట్రిపుల్ ఐటీని సందర్శించ లేదు. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ట్రిపుల్ ఐటీని ఎవరు సందర్శించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

టెక్స్‌టైల్ పార్క్ బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటులో భూములు కోల్పోయిన 863 మందికి స్టేట్ రిజర్వు కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి ఇళ్లు నిర్మించుకునేందుకు ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున ఇవ్వనున్నారు. టెక్స్‌టైల్ పార్క్ కోసం భూములు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్న కలెక్టర్ ప్రతిపాదనను ప్రత్యేక కేసు కింద పరిగణిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన సచ్చిదానంద స్వామి

సచ్చిదానంద బోధనలు ఆదర్శం

- డిజిటల్ యుగంలో ఆధ్యాత్మిక పత్రిక నడపడం అభినందనీయం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): భావి భారత పరిరక్షకులను తయారు చేయడానికి సచ్చిదానంద స్వామి దత్తపీఠంతో పాటు ఎన్నో విద్యాలయాలను నడుపుతున్నారని, మానవ సేవే మాధవ సేవ అని నమ్మడమే కాకుండా ఆచరించి చూపించిన గొప్ప మహనీయులు సచ్చిదానంద స్వామి అని మాజీ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. చేయిచేయి కలిస్తేనే సమాజ స్థాపన జరుగుతుందనే దత్తజీ బోధనలు మనందరికీ ఆదర్శమని తెలిపారు. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్‌లోని లలిత కళాతోరణంలో శనివారం నిర్వహించిన దర్శనం పత్రిక ద్విదశాబ్ది మహోత్సవంలో ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజహితం కోసం 20 ఏండ్లుగా దర్శనం దినపత్రిక నడుపుతున్న వెంకన్నను అభినందించారు. నేటి డిజిటల్ యుగంలో ఆధ్యాత్మిక పత్రిక నడపడం చాలా కష్టతరమని, అయినా ఎలాంటి లాభాపేక్ష లేకుండా దర్శనం దినపత్రిక నడపడం అభినందనీయమని పేర్కొన్నారు. దశాబ్దం క్రితం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దర్శనం పత్రిక వార్షికోత్సవానికి వచ్చారంటేనే వెంకన్న కృషి గురించి అర్థం చేసుకోవచ్చని చెప్పారు. వ్యాధులను నయం చేసే గుణం సంగీతానికి ఉందని చాటి చెప్పిన వ్యక్తి దత్తజీ అని తెలిపారు.

వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో నిరసన తెలుపుతున్న రైల్వే భూ నిర్వాసితులు

రైల్వే భూనిర్వాసితుల ఆందోళన

- వేములవాడలో నిరసన

వేములవాడ, నవంబర్ 16 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రైల్వే భూ నిర్వాసితులు శనివారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో నల్ల మాస్కులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే భూనిర్వాసితుడు, కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడుతూ.. రాజన్న ఆలయ అభివృద్ధి కోసమే భూములు ఇచ్చేందుకు తాము ముందుకు వచ్చినట్టు తెలిపారు. రైల్వే లైన్ కోసం ఇప్పటికే శివారు భూములు సేకరించారని, తమ భూముల విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి సమస్యను విన్నవించిన పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటిసారిగా రాజన్న ఆలయ అభివృద్ధి కోసం వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదానికి దిగిన బాధిత రైతులు

కాంగ్రెసోళ్ల భూకబ్జాపై ఎస్పీ సీరియస్

- చౌదూరు ఘటనపై పోలీస్, రెవెన్యూ ఆరా
- బాధితుల పొలాల్లో కడీలు పాతేందుకు మళ్లీ యత్నం
- అడ్డుకున్న రైతులు, వెనుదిరిగిన నాయకులు

నవాబ్‌పేట, నవంబర్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం చౌదూర్ గ్రామ శివారులో కాంగ్రెస్ నాయకులు భూముల కబ్జాకు పాల్పడుతున్న ఘటనను ఎస్పీ ధరావత్ జానకి సీరియస్‌గా తీసుకున్నట్టు తెలిసింది. 'కాస్తులో ఉన్నా.. కాంగ్రెసోళ్లు కబ్జా చేసిండ్రు' శీర్షికన శనివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎస్పీ స్పందించారు. సర్వే నంబర్ 340, 341లోని 12 ఎకరాలను 1977లో కొనుగోలు చేసిన నాటి నుంచి కాస్తులో ఉన్నా.. కొంతమంది అధికార పార్టీ నాయకులు కబ్జాకు యత్నించిన తీరుపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తంచేశారు. సంబంధిత నిఘా వర్గాలతోపాటు పోలీస్ అధికారులను సైతం భూమికి సంబంధించిన నివేదిక కోరినట్టు సమాచారం. ఈ విషయమై సమగ్ర సమాచారం కోసం పోలీస్, రెవెన్యూ, ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలు సేకరించి ఎస్పీకి నివేదిక కూడా పంపినట్టు తెలిసింది. ఇదిలావుండగా.. 'నమస్తే' కథనంపై అధికార పార్టీ నాయకుల్లో ఒకింత అలజడి మొదలైంది. శనివారం కూడా మళ్లీ బాధిత రైతుల భూముల్లో కడీలు పాతేందుకు నాయకులు, కొంతమందిని వెంట వేసుకొని వెళ్లారు. ఈ క్రమంలో కడీలు పాతకుండా పలువురు రైతులు అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. సర్వే చేసి తమ భూమిని చూయించిన తర్వాతే కడీలు పాతాలని తేల్చిచెప్పడంతో.. కడీలు పాతకుండానే నాయకులు వెనుదిరిగారు.

రేపటి నుంచి బీసీ కమిషన్ విచారణ

హైదరాబాద్, నవంబర్16 (నమస్తే తెలంగాణ): విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబడిన తరగతుల స్థితిగతులపై రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టనున్నారు. ఈ నెల 26 వరకు కొనసాగనున్న ఈ విచారణలో ప్రజలు, కులసంఘాల నుంచి విజ్ఞాపనలు, సలహాల స్వీకరించనున్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే తొలి విడత అక్టోబరు 28 నుంచి ఈనెల 2 వరకు ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, కరీంనగర్, హనుమకొండలో బహిరంగ విచారణ చేపట్టింది. ప్రస్తుతం మిగతా పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బహిరంగ విచారణ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. 18న నల్లగొండ, 19న ఖమ్మం, 21న రంగారెడ్డి, 22న మహబూబ్‌నగర్, 23న హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్లలో విచారణ కొనసాగుతుందని తెలిపారు. బహిరంగ విచారణకు హాజరు కాలేని కుల సంఘాల ప్రతినిధులు 25, 26 తేదీల్లో ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో నిర్వహించే బహిరంగ విచారణకు నేరుగా హాజరు కావచ్చని, లేదంటే పోస్టు ద్వారా కూడా అభిప్రాయాలను వెల్లడించవచ్చని సూచించారు.

ప్రకృతి పగ..సర్కారు దగా

- కుదేలవుతున్న తెలంగాణ రైతాంగం
- రైతుబంధుకు దిక్కులేదు.. భరోసాకు మొక్కులేదు
- కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేవు..
- పంటలకు మద్దతు ధర కరువు
- అకాల వర్షాలతో మెత్తబోయిన పత్తి
- కొనుగోళ్లులేక ముక్కిపోతున్న మక్క

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ 11 నెలల పాలనలో తెలంగాణ రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. మొన్నటిదాకా కురిసిన వానలతో వేసిన పంట దెబ్బతిడం, ఇటు రైతుభరోసా ఎగ్గొట్టి సర్కారు దగా చేయడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నది. చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులోనూ జాప్యం చేస్తుండడంతో దళారులకు తెగనమ్ముకుంటూ బోరుమంటున్నది. వానలతో మెత్తబడ్డ పత్తికి మద్దతు ధర దక్కే అవకాశం లేకపోవడంతో అప్పుల భారం పెరిగిపోయి కుదేలవుతున్నది. ఇగ కొనేవారు దిక్కులేక పండించిన మక్క ఇండ్లలోనే ముక్కిపోతుండడంతో గగ్గోలు పెడుతున్నది. ఈ వానకాలం సీజన్ తెలంగాణ రైతులకు కలిసిరాలేదు. కాళేశ్వరం నీళ్లు విడుదల చేయకపోవడం, సకాలంలో వానలు కురువకపోవడం, సర్కారు నుంచి పెట్టుబడి సాయం అందకపోవడంతో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. గతేడాదితో పోల్చితే సుమారు 5 లక్షల ఎకరాల్లో ఈ సారి ఎలాంటి పంటలు వేయలేదు. సాగు చేసిన తర్వాత వరుసగా తుపాన్లు విరుచుకుపడడంతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. సర్కారు కొందరు రైతులకు మాత్రమే ఎకరాకు రూ. 10 వేల చొప్పున అందించి చేతులు దులుపుకున్నది.

ఊరించి.. ఊరించి భరోసాకు ఎగనామం

అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు పంటలకు ఎకరాకు రూ. 15 వేల రైతుభరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పూటకో ప్రకటనతో రైతులను మోసం చేస్తున్నది. నిధుల్లేవనే సాకుతో యాసంగి పంటకు గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధుతో సరిపెట్టింది. అదికూడా ఐదు నెలలుగా సాగదీసి పంటలు చేతికొచ్చే సమయంలో ఖాతాల్లో జమ చేసింది. ఈ వానకాలం పంట నుంచే రైతుభరోసా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల సభల్లో ఊదరగొట్టారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి మార్గదర్శకాలు రూపొందిస్తామని పేర్కొన్నారు. కానీ అసెంబ్లీ బడ్జెట్ సెషన్‌లో ఈ ఊసే ఎత్తలేదు. ఆ తర్వాత రైతురుణమాఫీ కారణంగా నిధుల కొంత ఆలస్యం జరుగుతుందని వానకాలం పంటకు రైతుభరోసా పక్కాగా ఇస్తామని నమ్మించారు. జూలై 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతా ల్లో పర్యటించి, రైతులు, వ్యవసాయరంగ నిపుణుల అభిప్రాయాలను సమీకరించి 15 రోజుల్లో నివేదిస్తామని పేర్కొన్నారు. సబ్‌కమిటీ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మొక్కుబడిగా పర్యటించింది. రైతులతో తూతూమంత్రపు సమావేశాలు నిర్వహించి హంగామా చేసింది. రేపు, మాపు అంటూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటనలు చేశారు. సెప్టెంబర్ 18న రైతుభరోసాను కౌలు రైతులకు ఇవ్వబోమని చెప్పారు. ఈ విషయంలో కౌలుదారులు, రైతులే తేల్చుకోవాలని స్పష్టంచేశారు. తర్వాత చాలా రుణమాఫీ చేసిన వెంటనే ఇస్తామంటూ రైతులను ఆశల్లో ముంచెత్తారు. తీరా ఈ సీజన్‌కు భరోసా ఇవ్వబోమని చావు కబురు చల్లగా చెప్పి నిండా ముంచారు.

బోనస్ పేరిట బోగస్

ఇక రైతుభరోసా తరహాలోనే పంటలకు బోనస్ విషయంలోనూ ప్రభుత్వం నాలుక మడతేసింది. ఎన్నికల టైమ్‌ల అన్ని వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ నమ్మబలికింది. రైతు డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీతోనూ చెప్పించింది. వానకాలం పంటల సమయంలో దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వలేమని చేతులెత్తేశారు. సన్న రకాల్లోనూ కొన్నింటికే ఇస్తామని మెలికపెట్టారు. ఇప్పటికైతే గింజ ధాన్యానికి కూడా ఎక్కడా బోనస్ ఇచ్చిన దాఖలాలు కనిపించలేదు.

పత్తి రైతుల విలవిల

ఈ ఏడాది పత్తిపంటను రైతులు 4.32 ఎకరాల్లో సాగు చేశారు. వాతావారణ అననుకూలతలతో ఆశించిన మేర దిగుబడి రాలేదు. వచ్చిన కొద్దిపాటి పంట కూడా తేమశాతం పెరుగుతుండడంతో రైతులు దళారులకు సగటున క్వింటాల్‌కు రూ. 5000 చొప్పున అమ్ముకున్నారు.ఆ తర్వాత సీసీఐ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించింది. అయితే పత్తిలో నిర్ణీత తేమ శాతం 8 కంటే ఎక్కువ ఉండడంతో రైతులకు కనీస మద్దతు ధర రూ. 7,521 దక్కడం అనుమానమే. అలాగే 100 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మక్కలను కొనుగోలు చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు ఆచరణలో విఫలమయ్యారు. కేవలం ఒకటి రెండు సెంటర్లు తెరిచి మమ అనిపించారు.

రైతు రుణమాఫీ పేరిట మోసం

రుణమాఫీ అమలు విషయంలోనూ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. రూ. 2లక్షల వరకు లోన్లను ఆగస్టు 15లోగా ఒకే విత మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ సగం మందికి మాత్రమే చేశారు. మిగిలినవారు బ్యాంకులు, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. తాజాగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దీపావళిలోగా మరో 4 లక్షల మంది రైతులను రుణవిముక్తుల్ని చేస్తామని ప్రకటించారు. పండుగ అయిపోయినా చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. అసలు రుణాల మాఫీకి ఎంత సమయం పడుతుందో అర్థం కావడంలేదు. మొత్తంగా అన్నదాతలను ప్రకృతి పగబడితే సర్కారు దగా చేసింది

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

- 11 నెలలైనా పైసా ఇవ్వని సర్కార్
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
- ఈసీఐఎల్ లో విద్యార్థుల మహా నిరసన ప్రదర్శన



ఈసీఐఎల్‌లో నిర్వహించిన మహార్యాలీలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ, విద్యార్థులు

కాప్రా/భువనగిరి అర్బన్/హనుమకొండ చౌరస్తా, నవంబర్ 16: రాష్ట్రంలో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్రప్రభుత్వం తక్షణమే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, ఫీజు బకాయిల చెల్లింపులు, మెస్ బిల్లుల పెంపు, తదితర సమస్యలపై హైదరాబాద్ ఈసీఐఎల్ చౌరస్తాలో శనివారం విద్యార్థుల మహా ర్యాలీ నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనను ఉద్దేశించి ఆర్ కృష్ణయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఇంతవరకు బకాయిలు చెల్లించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. నాలుగు నెలలుగా విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉన్నదని, కానీ విద్యార్థులు అంటే పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. తన వైఖరి మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదని, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు కలిసి నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యుత్తు ఉద్యోగుల సంఘం నాయకుడు ముత్యం వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. భువనగిరి ఆర్డీవో కార్యాలయాన్ని విద్యార్థులు ముట్టడించారు. కార్యాలయ గదికి తాళం వేసి నిరసన తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్, నూనావత్ అరుణ్‌నాయక్, మహలింగం పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ పాల్గొన్నారు.

5, 6న 'చలో ఢిల్లీ'

జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నవంబర్16 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్త జనగణనలో బీసీ కులగణనను సైతం నిర్వహించాలనే ప్రధాన డిమాండ్‌తో డిసెంబర్ 5, 6 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం జనవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించనున్నది. అందులోనే కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 5న మహా ధర్నా, 6న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

ఫోర్త్ సిటీపై పల్లెల ఫైట్

మొదటిపేజీ తరువాయి...

అంతేకానీ మీరెలా నిర్ణయిస్తారు? ఇంతే ఇస్తామని చెప్పడం ఏమిటి? అయినా, మాకు సమాచారం ఇవ్వకుండా సర్వేకు ఎలా వస్తారు? రోడ్డు కోసం భూమి ఇచ్చేదే లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ అధికారులపై రైతులు తిరగబడ్డారు. దీంతో లగచర్ల ఘటనను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెనక్కి తగ్గారు.

అంత వెడల్పాటి రోడ్డెందుకు?

కందుకూరు మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీకి సంబంధించి రోడ్డు సర్వే పనులను అధికారులు చేపట్టారు. అందులో భాగంగా రోడ్డు వెళ్లే మార్గంలో సర్వేకు అధికారులు రంగంలోకి దిగారు. శనివారం కృష్ణయ్య, సాయికాంత్‌తో కూడిన సర్వే బృందం రాచులూరు, బేగంపేట గ్రామాలకు వెళ్లింది. రోడ్డు కోసం భూసేకరణ సర్వేకు సిద్ధమవగా విషయం తెలిసిన రైతులు దాదాపు వందమంది అక్కడికి చేరుకుని అధికారులను నిలదీశారు. తమ భూముల్లో సర్వేకు చేయడా నికి మీరెవరని ప్రశ్నించారు. తహసీల్దార్ గోపాల్, గ్రామ పెద్ద, అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ రైతులు ససేమిరా అంటూ సర్వే చేయనిచ్చేది లేదని తెగేసి చెప్పారు. రోడ్డుకు 300 అడుగులు అవసరమని చెప్పి 330 అడుగులు తీసుకుంటున్నారని, అంత రోడ్డు అవసరమా? అని ప్రశ్నించారు. తామంతా చిన్న, సన్నకారు రైతులమని, తమకున్న కొద్దిపాటి భూమిలో అంత రోడ్డుపోతే ఎలా బతకాలని నిలదీశారు. దీంతో చేసేది లేక వెనక్కి తగ్గిన తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యలను సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పి వెనుదిరిగారు.